క్లుప్తంగా

మోపిదేవి పోలీస్‌స్టేషన్ భవనం పరిశీలన



మోపిదేవి: మోపిదేవిలో పోలీస్ స్టేషన్ ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉందని అవనిగడ్డ డీఎస్పీ మురళీధర్ తెలిపారు. రూ. 1.40 కోట్లతో నూతనంగా నిర్మించిన పోలీస్ స్టేషన్‌ను గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెయింటింగ్ పూర్తి చేయాల్సి ఉందన్నారు. రాష్ట్ర డీజీపీ, జిల్లా ఎస్పీ ఇచ్చిన డేట్ ప్రకారం ఈ నెలలోనే ప్రారంభానికి సిద్ధం చేశామని వివరించారు. చల్లపల్లి సీఐ భీమేశ్వర రవికుమార్, మోపిదేవి ఎస్ఐ సీహెచ్ పద్మ, పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ ఏఈ చైతన్య, బందారు మధుబాబు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడా పరికరాల వితరణ



నాగాయలంక: మండలంలోని ప్రముఖ రైస్ మిల్లర్ బంద్రెడ్డి వెంకటేశ్వరరావు ఆర్థిక సహకారంతో స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్లస్ విద్యార్థులకు రూ.20 వేల విలువైన క్రీడా పరికరాలను అందజేశారు. గురువారం జరిగిన పాఠశాల అసెంబ్లీ సమావేశంలో వీటిని ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు పీవీఎస్ ప్రసాద్ చేతుల మీదుగా విద్యార్థులకు అందించారు. కార్యక్రమంలో పాఠశాల ఫిజికల్ డైరెక్టర్లు గాజుల లక్ష్మీప్రసాద్, కోసూరు పూర్ణచంద్రరావు, ఉపాధ్యాయులు, పీఎంసీ సభ్యులు పాల్గొన్నారు.

అంకితభావంతో పని చేయాలి



పెడన: సిబ్బంది అంకితభావంతో పనిచేయాలని, అప్పుడే మంచి గుర్తింపు లభిస్తుందని తహసీల్దార్ పి. మధుసూదనరావు అన్నారు. గురువారం తహసీల్దార్ కార్యాలయంలో ఉత్తమ అవార్డును అందుకున్న తహసీల్దార్ మధుసూదనరావును ఆర్ఐ మణికుమార్, సర్వేయర్ కృష్ణలతో కలిసి మండలంలోని వీఆర్వోలు ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా తహసీల్దార్ వారికి దిశానిర్దేశం చేశారు.

రూ. 20 లక్షలతో డ్రెయినేజీ నిర్మాణం



మోపిదేవి: స్థానిక వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి దేవస్థానం ఆధ్వర్యంలో పక్కా డ్రెయినేజీ ఏర్పాటు చేస్తున్నామని ఆలయ ఏసీ ఎన్ఎస్ చక్రధరరావు గురువారం తెలిపారు. గతంలో ఏర్పాటు చేసిన డ్రెయినేజీని 11వ నంబర్ కాలువ నుంచి కొనసాగిస్తూ గ్రామం చివరి వరకు డ్రెయినేజీ నిర్మిస్తామని చెప్పారు. దేవస్థానం నిధులు రూ. 20 లక్షలతో సుమారు 850 అడుగుల పొడవుతో సీసీ ఓపెన్ డ్రెయినేజీ నిర్మాణానికి అంచనాలు రూపొందించామని వివరించారు. దేవదాయశాఖ ఈఈ టి. దుర్గేష్ కుమార్, డీఈఈ డీజీకే రాజు, ఏఈ నాగేంద్రకుమార్, సచివాలయ ఇంజినీరింగ్ అధికారి, గ్రామ కార్యదర్శి త్రిపుర సుందరి, ఆలయ అధికారులు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

విజయగౌరీకి పీహెచ్‌డీ ప్రదానం



కోనేరుసెంటర్: కృష్ణా యూనివర్సిటీ విద్యార్థి విజయగౌరికి ఆంగ్లంలో పీహెచ్‌డీ లభించింది. యూనివర్సిటీ ఆంగ్ల విభాగంలో అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎం. కోటేశ్వరరావు పర్యవేక్షణలో ఆమె పరిశోధన చేసి పత్రం సమర్పించింది. ఈ సందర్భంగా విజయగౌరికి యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ జి. జ్ఞానమణి పీహెచ్‌డీ ప్రదానం చేసి అభినందించారు.

నేడు మండల పరిషత్ సమావేశం

మోపిదేవి: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం శుక్రవారం మధ్యాహ్నం రెండు గంటలకు సభా మందిరంలో ఎంపీపీ రావి దుర్గావాణి అధ్యక్షతన జరుగుతుందని ఎంపీడీఓ కె. రామలింగేశ్వరరావు తెలిపారు. మండల స్థాయి అధికారులు తమ వద్ద ఉన్న పూర్తి సమాచారంతో హాజరు కావాలన్నారు.

మత్స్యకారుల సంక్షేమానికి ప్రాధాన్యం

- ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు
- నాచుగుంటలో గడప గడపకు మన ప్రభుత్వం



బ్రోచర్ అందజేసి పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే సింహాద్రి

నాచుగుంట(నాగాయలంక): తీర ప్రాంతాల మత్స్యకారుల సంక్షేమానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రాధాన్యతనిస్తూ అనేక పథకాలు అమలు చేస్తున్నారని అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం మండలంలోని ఎదురుమొండిదీవి నాచుగుంట గ్రామంలో గురువారం నిర్వహించారు. ఎమ్మెల్యే రమేష్‌బాబు స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి 430 గృహాలను సందర్శించి ప్రభుత్వ పథకాలను వివరించారు. ఇప్పటివరకు పథకాల ద్వారా పొందిన లబ్ధిని వారికి తెలిపారు. స్థానికుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. బడుగు, బలహీన వర్గాలు, ఎస్సీ, ఎస్టీల అభ్యున్నతికి సీఎం జగనన్న నిరంతరం శ్రమిస్తున్నారని, ప్రజలందరూ ఆయనకు అండగా నిలవాలని కోరారు. సర్పంచ్ చెన్ను విజయ, నాగాయలంక జెడ్పీటీసీ మోకా బుచ్చిబాబు, దివి ఏఎంసీ చైర్మన్ కొక్కిలిగడ్డ వెంకటేశ్వరరావు, నియోజకవర్గ సచివాలయాల కన్వీనర్ మద్ది వెంకట నారాయణ (చిన్నారి), ఎంపీటీసీ సభ్యులు సైకం వసంతరావు, కొల్లు యానాదిరావు, బర్రంకుల పీఏసీఎస్ అధ్యక్షుడు తోట సాయిబాబు, సైకం నాగబాబు, చెన్ను వెంకటేశ్వరరావు, నాగపుష్పారావు, సైకం బస్వారావు, పోతాబత్తిన నాగేశ్వరరావు పాల్గొన్నారు.



పల్లెనిద్రలో ఎమ్మెల్యే సింహాద్రి

పల్లెనిద్రలో ఎమ్మెల్యే సింహాద్రికి వినతులు..

ఈలచెట్లదిబ్బ కార్యక్రమం అనంతరం ఎమ్మెల్యే రమేష్‌బాబు బుధవారం రాత్రి నాచుగుంట గ్రామంలోని పాఠశాలలో పల్లెనిద్ర జరిపారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు, వైఎస్సార్ సీపీ శ్రేణులు ఆయనను కలిసి ఎదురుమొండి నుంచి పైప్‌లైన్‌లో వచ్చే తాగునీరు బాగుండటం లేదని, ఫిల్టర్ బెడ్‌లకు మరమ్మతులు చేయించాలని కోరారు. అలాగే నాచుగుంట–ఎదురుమొండి రోడ్డు సమస్యను త్వరితగతిన పరిష్కరించాలన్నారు.

సర్పంచ్ ఉప ఎన్నికల పోలింగ్‌కు పటిష్ట చర్యలు

మచిలీపట్నం డీఎల్‌పీఓ జ్యోతిర్మయి



పోలింగ్ బూత్‌లో ఏర్పాట్లపై సమీక్షిస్తున్న డీఎల్‌పీఓ జ్యోతిర్మయి తదితరులు

పెడన: సర్పంచ్, వార్డు సభ్యుల ఉప ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నామని మచిలీపట్నం డీఎల్‌పీఓ ఐ. జ్యోతిర్మయి అన్నారు. గురువారం ఆమె ఎంపీడీఓ రెడ్డయ్యతో కలిసి మండల పరిధిలోని ఉప ఎన్నిక జరిగే కొంగంచర్ల పంచాయతీలో పర్యటించారు. తొలుత వీరు గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్‌బూత్‌ను పరిశీలించి అక్కడ ఏర్పాట్లపై సిబ్బందితో సమీక్షించారు. పోలింగ్ అనంతరం లెక్కింపు ప్రక్రియకు కూడా చర్యలు చేపట్టాలని సిబ్బందిని ఆదేశించారు. ఈ సందర్భంగా డీఎల్‌పీఓ విలేకరులతో మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా సర్పంచ్ ఉప ఎన్నిక పెడన మండలం కొంగంచర్లలో మాత్రమే జరుగుతుందన్నారు. ఇద్దరు అభ్యర్థులు లోయ ఊహ, పుట్టి శ్యామల బరిలో ఉన్నారని చెప్పారు. 469 మంది ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకోనున్నారని తెలిపారు. శనివారం ఉదయం ఏడు నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పోలింగ్ జరుగుతుందని, మధ్యాహ్నం రెండు గంటల నుంచి లెక్కింపు ఉంటుందన్నారు. అత్యంత సమస్యాత్మకమైన గ్రామంగా గుర్తించి పోలీస్ బందోబస్తును ఏర్పాటు చేసేలా చర్యలు చేపట్టామని చెప్పారు. దీనితో పాటు కాకర్లమూడి పంచాయతీలోని కాకర్లమూడిపాలెం నాలుగో వార్డు సభ్యునికి కూడా పోలింగ్ జరుగుతుందన్నారు. అక్కడ కూడా పోలింగ్, లెక్కింపు సమయాలు ఇలాగే ఉంటాయని తెలిపారు. మచిలీపట్నం డీఎల్‌పీఓ కార్యాలయ ఏఓ, కొంగంచర్ల ఎన్నికల పరిశీలకుడు వి. సీతారామయ్య, ఈఓపీఆర్డీ జయరాం, ఎన్నికల అధికారి అశోక్‌కుమార్, గ్రామ సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్, మహిళా పోలీస్ పాల్గొన్నారు.

4వ వార్డు ఎన్నికకు ఏర్పాట్లు..

బంటుమిల్లి: బంటుమిల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని 4వ వార్డు ఉప ఎన్నిక నిర్వహణకు అధికారులు ఏర్పాట్లు చేశారు. వార్డు సభ్యురాలు గొల్ల నిర్మల అకాల మరణంతో ఉప ఎన్నిక అనివార్యమైంది. వార్డును ఎస్సీ రిజర్వుడుకు కేటాయించారు. ఈ క్రమంలో ఈ నెల 19వ తేదీన ఉప ఎన్నిక జరగనుంది. దీంతో ప్రస్తుత పాలకవర్గం మరణించిన సభ్యురాలు నిర్మల కోడలు గొల్ల సృజనిని బలపరుస్తోంది. ఏకగ్రీవం అవుతుందని అందరూ భావిస్తున్న తరుణంలో అధిష్టానం నుంచి వచ్చిన ఆదేశాల మేరకు టీడీపీ బేతపూడి మంజులను పోటీలో పెట్టింది. ఎన్నికల అధికారి అనూరాధ సృజనికి కుక్కర్, మంజులకు గౌను గుర్తులు కేటాయించారు. 4వ వార్డులో 342 మంది ఓటర్లు వీరిద్దరి భవిష్యత్‌ను శనివారం తేల్చనున్నారు. ఇరు వర్గాలు ముమ్మరంగా ప్రచారం చేశారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ఏర్పాటు చేసిన ఎన్నికల బూత్‌లో ఉదయం 7 నుంచి ఒంటి గంట వరకు పోలింగ్ ప్రక్రియ జరిగిన అనంతరం కౌంటింగ్ జరుగుతుందని ఎంపీడీఓ స్వర్ణభారతి తెలిపారు.

వెంకటస్వామి నాయుడు దాన గుణం మరువలేనిది



పార్కు కార్మికుడికి నూతన వస్త్రాలు అందజేస్తున్న విగ్రహ కమిటీ సభ్యులు

మచిలీపట్నంటౌన్: నగరంలోని మునిసిపల్ ప్రధాన పార్కుకు స్థలాన్ని దానంగా ఇచ్చిన మాకర్ల వెంకటస్వామి నాయుడు దానగుణం మరువలేనిదని వెంకటస్వామి నాయుడు విగ్రహ కమిటీ చైర్మన్ పిల్లారిశెట్టి శ్రీనివాసరావు అన్నారు. వెంకటస్వామి నాయుడు 144వ జయంతి కార్యక్రమం గురువారం స్థానిక ప్రధాన పార్కులో జరిగింది. వెంకటస్వామి నాయుడు కాంస్య విగ్రహానికి శ్రీనివాసరావు, విగ్రహ కమిటీ ప్రతినిధులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. శ్రీనివాసరావు మాట్లాడుతూ వెంకటస్వామి నాయుడు తన జీవితంలో అనేక దానధర్మాలు చేశారన్నారు. కోట్ల రూపాయల విలువైన స్థలాన్ని పార్కుకు ఇవ్వడం ఆయన దానగుణానికి నిదర్శనమని చెప్పారు. ఈ సందర్భంగా పార్కులో పనిచేసే కార్మికులకు నూతన వస్త్రాలను అందజేశారు. కార్యక్రమంలో పిల్లారిశెట్టి సత్యనారాయణ, మాదిరెడ్డి ఆంజనేయులు, కుసుమ హరినాథ్, పి. బాబ్జీ, ఉల్లి రంగారావు, పార్కు సూపర్‌వైజర్ రంగబాబు, కార్మికులు పాల్గొన్నారు.

కేడీసీసీబీ చైర్‌పర్సన్ పద్మావతికి సన్మానం



పద్మావతిని సన్మానిస్తున్న గోవర్ధనరావు

చల్లపల్లి: కేడీసీసీ బ్యాంక్ చైర్‌పర్సన్ తాతినేని పద్మావతిని విజయవాడలోని కేడీసీసీ బ్యాంక్ కార్యాలయంలో గురువారం ఘనంగా సన్మానించారు. వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షులు వేమూరి గోవర్ధనరావు, పాగోలు ఎంపీటీసీ మేకా సత్యనారాయణ ప్రసాద్ (బంగారుబాబు), నడకుదురు, మంగళాపురం సర్పంచ్‌లు గొరిపర్తి సురేష్‌బాబు, డొక్కు నాగేశ్వరరావు, పీఏసీఎస్ చైర్మన్ పేరం నాగిరెడ్డి సత్కరించారు.

సమన్వయంతో ప్రజా సమస్యల పరిష్కారం

ఎంపీపీ ఈడ్పుగంటి రాజామణి

తోట్లవల్లూరు: ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో ముందుకు సాగుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని తోట్లవల్లూరు ఎంపీపీ ఈడ్పుగంటి రాజామణి సూచించారు. స్థానిక మండల పరిషత్ సమావేశ హాలులో గురువారం జరిగిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశానికి ఆమె అధ్యక్షత వహించారు. సమావేశం వాడీవేడిగా సాగింది. విద్య, వైద్యం, పశువైద్యం, ఇరిగేషన్, ట్రాన్స్‌కో, ఐసీడీఎస్, ఉపాధి హామీ, రెవెన్యూ, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్, హౌసింగ్, వెలుగు, ఆర్టీసీ, వ్యవసాయం, తదితర శాఖలకు సంబంధించిన అంశాలపై శాఖల వారీగా రాజామణి సమీక్ష జరిపారు. అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని జెడ్పీటీసీ సభ్యుడు జొన్నల రామ్మోహన్‌రెడ్డి తెలియజేశారు. సంక్షేమ పథకాలు వివక్షతకు తావు లేకుండా ఎలా అమలు జరుగుతున్నాయో, గ్రామాల అభివృద్ధి కూడా అలాగే జరుగుతోందన్నారు.

టీడీపీ సభ్యుల రగడ..

టీడీపీకి చెందిన బొడ్డపాడు సర్పంచ్ మూడే శివశంకర్, గరికపర్రు సర్పంచ్ వీరంకి రమాదేవి, జనసేనకు చెందిన ఐలూరు సర్పంచ్ పిరాటి సుజాత సమావేశంలో రగడ సృష్టించారు. బొడ్డపాడు సచివాలయ నిర్మాణంలో తీవ్ర జాప్యం చేస్తున్నారని, పంచాయతీ తీర్మానం లేకుండా మెటీరియల్ కాంట్రాక్టు వేరే వ్యక్తికి ఇచ్చారని, పంచాయతీ 15వ ఆర్థిక సంఘం నిధులు ప్రభుత్వం దొంగిలించిందని ఆరోపిస్తూ శివశంకర్ వాదనకు దిగారు. ఆయనకు మద్దతుగా రమాదేవి, సుజాత నేలపై బైఠాయించి సమావేశం నిర్వహణకు తీవ్ర ఆటంకం కలిగించారు. సుమారు అరగంటపాటు సభను స్తంభింప చేయటంతో తీవ్ర గందరగోళం నెలకొంది. ఎంపీపీ రాజామణి, జెడ్పీటీసీ రామ్మోహన్‌రెడ్డి, ఎంపీడీఓ తుంగల స్వర్ణలత, వైస్ ఎంపీపీ కళ్లం శివారెడ్డి ఎంత నచ్చచెప్పినా ఫలితం లేకపోవటంతో ఎంపీపీ పోలీసులకు సమాచారం అందించారు. ఎస్ఐ రమేష్ వచ్చి నచ్చజెప్పినా శివశంకర్ వినకపోవటంతో సిబ్బంది సహకారంతో బలవంతంగా బయటకు తీసుకువెళ్లారు. సమావేశంలో వైస్ ఎంపీపీ మెల్లంపల్లి వెంకటేశ్వరరావు, తహసీల్దార్ కుసుమకుమారి, కార్యాలయ ఏఓ ఉషారాణి, ఎంఈఓ సురేష్, హౌసింగ్, పీఆర్, ట్రాన్స్‌కో, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈలు భవానీప్రసాద్, రాఘవరావు, దేవదాసు, వెంకటేశ్వరరెడ్డి, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

గద్దర్‌కు ఘన నివాళి

లక్ష్మీపురం(చల్లపల్లి): ప్రజా గాయకుడు గద్దర్ చిరస్మరణీయులని వైఎస్సార్ సీపీ జిల్లా ఎస్సీ సెల్ సీనియర్ నాయకులు మద్దాల వీరాస్వామి అన్నారు. గురువారం లక్ష్మీపురం పంచాయతీ శివారు పుచ్చగడ్డలో అంబేడ్కర్ విగ్రహం వద్ద గద్దర్ సంస్మరణ కార్యక్రమం నిర్వహించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని గద్దర్‌కు నివాళులర్పించారు.

ఆనందేశ్వరస్వామి దేవస్థానంలో చోరీ



దేవస్థానంలో దొంగలు పగులకొట్టిన హుండీ

గుడివాడరూరల్: పట్టణంలోని బేతవోలులో ఉన్న శ్రీఆనందేశ్వరస్వామి దేవస్థానంలో బుధవారం అర్ధరాత్రి దొంగలు హల్‌చల్ చేశారు. సీసీ కెమెరాలను పక్కకు నెట్టి దేవస్థాన ప్రాంగణంలో ఉన్న హుండీని పగులకొట్టి డబ్బును దొంగిలించారు. గర్భగుడి తెరిచేందుకు యత్నించి విఫలమయ్యారు. గురువారం ఉదయం దేవస్థానంలో పూజలు చేసేందుకు వచ్చిన అర్చకులు దేవస్థానంలో చోరీ జరిగిందని గుర్తించి వెంటనే పరిసర ప్రాంత ప్రజలకు, పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న డీఎస్పీ పి.శ్రీకాంత్ తన సిబ్బందితో కలసి పగులకొట్టిన హుండీ, గర్భగుడి ముఖద్వారాలను పరిశీలించారు. మచిలీపట్నం నుంచి ఫోరెన్సిక్స్ బృందం వచ్చి ఆధారాలు సేకరించింది. ఈ సందర్భంగా డీఎస్పీ శ్రీకాంత్ మాట్లాడుతూ దేవస్థానంలోని స్వామివారి గర్భాలయ తలుపులను గుర్తు తెలియని దుండగులు గునపాలతో తెరిచేందుకు విఫలయత్నం చేశారన్నారు. హుండీలో నగదు దోచుకోవడంతో పాటు సీసీ కెమెరాల హార్డ్ డిస్క్‌ను దొంగలు ఎత్తుకెళ్లినట్లు గుర్తించామన్నారు.

మార్గదర్శి మచిలీపట్నం బ్రాంచిలో సీఐడీ సోదాలు

మచిలీపట్నంటౌన్: మార్గదర్శి చిట్‌ఫండ్ ప్రైవేట్ లిమిటెడ్ మచిలీపట్నం బ్రాంచ్‌లో సీఐడీ అధికారులు గురువారం సోదాలు నిర్వహించారు. మధ్యాహ్నం 12.30 గంటల నుంచి కార్యాలయంలోని పలు రికార్డులను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. రాత్రి వరకు సోదాలు కొనసాగుతూనే ఉన్నాయి. వివరాలు తెలిపేందుకు సీఐడీ అధికారులు నిరాకరించారు.

ఆక్యుప్రెజర్ విధానంలో దీర్ఘకాలిక వ్యాధులకు చికిత్స

పెడన: ఆక్యుప్రెజర్ విధానంలో దీర్ఘకాలిక వ్యాధులకు చికిత్స చేయడం ద్వారా నయం చేయవచ్చని డాక్టర్ కొల్లూరి సత్యనారాయణ (చిన్నా) అన్నారు. పెడన పట్టణ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో స్థానిక వాసవి ప్రార్థన మందిరంలో ఆక్యుప్రెజర్ వైబ్రేషన్ సుజోక్ అయస్కాంత చికిత్స ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఈ శిబిరం ఐదు రోజుల పాటు జరుగుతుందన్నారు. రాజస్థాన్ ఆరోగ్య జీవన్ సంస్థాన్ హనుమాన్ గడ్ (రాజస్థాన్)కు చెందిన థెరపిస్ట్ వైద్యులు డాక్టర్ రామమనోహర్ లోహియా, డాక్టర్ తాన్ రాజ్ చౌదరి, డాక్టర్ రేవంత్ చౌదరిలు పాల్గొని ప్రతిరోజు ఉదయం 8 నుంచి 12 గంటల వరకు, సాయంత్రం నాలుగు నుంచి 8 గంటల వరకు రోగులకు చికిత్స చేస్తారని చెప్పారు. దీర్ఘకాలిక వ్యాధులైన రక్తపోటు, మధుమేహం, ఊబకాయం, అజీర్ణం, గ్యాస్ట్రిక్ సమస్య, సయాటికా, మోకాళ్ల నొప్పులు, శ్వాసకోశ వ్యాధులు, నిద్రలేమి, నడుము నొప్పి, కీళ్ల నొప్పులు, మూత్రపిండాలలో రాళ్లు తదితర వ్యాధులకు ఉచిత సేవలను అందిస్తారని తెలిపారు. అయితే రూ.100 రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించాల్సి ఉంటుందని చెప్పారు. పట్టణ ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

ఈ-డివిజనల్ మేనేజర్ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

చిలకలపూడి(మచిలీపట్నం): ఈ డివిజనల్ మేనేజర్ పోస్టుకు కాంట్రాక్టు పద్ధతిలో పనిచేసేందుకు అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని డీఆర్వో ఎం. వెంకటేశ్వర్లు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 2022 జూలై 1వ తేదీ నాటికి అభ్యర్థులు 21 నుంచి 30 సంవత్సరాల మధ్య వయస్సు ఉండాలన్నారు. అభ్యర్థులు బ్యాచిలర్ డిగ్రీ కలిగి ఉండాలని చెప్పారు. దరఖాస్తులను ఈ నెల 26వ తేదీలోగా జిల్లా కలెక్టర్ కార్యాలయానికి రిజిస్టర్ పోస్టు ద్వారా పంపాల్సి ఉందన్నారు. నిర్దేశించిన గడువులోగా దాఖలు చేసిన అర్హత గల అభ్యర్థుల దరఖాస్తులను పరిశీలించి రాతపరీక్ష నిర్వహిస్తామని చెప్పారు. ఈ పరీక్ష ద్వారా ఎంపికైన వారికి జిల్లా కమిటీ ద్వారా ఎంపిక నిర్వహిస్తారన్నారు. ఇంటర్వ్యూ సమయంలో ఐటీ సెక్టార్‌లో కనీసం రెండేళ్ల అనుభవం కలిగిన వారికి 5 శాతం వెయిటేజీ ఇస్తారని పేర్కొన్నారు.

ఈఓఆర్డీ అశోక్‌కు సన్మానం

చల్లపల్లి: పంచాయతీ ఈఓలతో సమన్వయంగా పనిచేస్తూ ప్రభుత్వ కార్యక్రమాలు విజయవంతం చేస్తున్న ఈఓఆర్డీ బూరేపల్లి అశోక్ ప్రశంసనీయులని ఎంపీడీఓ సీహెచ్ చినరాట్నాలు అన్నారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జిల్లా ఉత్తమ ఈఓఆర్డీ అవార్డు గ్రహీత అశోక్‌ను ఘనంగా సన్మానించారు. పంచాయతీ ఈఓలు పేర్ని మాధవేంద్రరావు, పి.రాంబాబు, సుబ్బారావు, సుధాకర్, శ్యాంసన్ పాల్గొన్నారు.

జగన్ ప్రభుత్వంలో అన్నివర్గాలకు మేలు

పేర్ని కిట్టు



స్థానికుల సమస్యలను అడిగి తెలుసుకుంటున్న పేర్ని కిట్టు

మచిలీపట్నంటౌన్: కులమతాలు, రాజకీయాలకు అతీతంగా అన్నివర్గాలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మేలు చేస్తున్నారని వైఎస్సార్ సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జి పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) అన్నారు. రాష్ట్రంలోని ప్రజల కష్టాలెరిగిన ముఖ్యమంత్రిగా ఆయన ప్రజల ఆదరణ పొందుతున్నారని చెప్పారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం మూడో డివిజన్‌లో కార్పొరేటర్, డెప్యూటీ మేయర్ శీలం భారతితో కలిసి గురువారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు అందిన సంక్షేమ పథకాల వివరాలతో ముద్రించిన బ్రోచర్లను అందజేశారు. పేర్ని కిట్టు మాట్లాడుతూ ప్రజా సంకల్ప యాత్రలో రాష్ట్రం మొత్తం కలియ తిరిగిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నివర్గాల ప్రజలతో మమేకమై వారి సాదకబాధలను తెలుసుకున్నారని చెప్పారు. నాడు తన దృష్టికి వచ్చిన సమస్యలను పరిష్కరించేందుకు పలు సంక్షేమ పథకాలను రూపొందించి అమలు చేస్తూ ఆయా వర్గాలను ఆదుకుంటున్నారని వివరించారు. వర్షంలో సైతం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని పేర్ని కిట్టు నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ శీలం బాబ్జీ, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

పంట నమోదు, ఈకేవైసీ తప్పనిసరి

గూడూరు తహసీల్దార్ విజయప్రసాద్

గూడూరు: రైతులు తప్పనిసరిగా పంట నమోదుతో పాటు ఈకేవైసీ చేయించు కోవాలని గూడూరు తహసీల్దార్ బి.విజయప్రసాద్ అన్నారు. తుమ్మలపాలెం ఏరియాలో గురువారం తహసీల్దార్ బి. విజయ్ ప్రసాద్, మండల వ్యవసాయాధికారి జీవీ శివప్రసాద్‌తో కలిసి పంట నమోదును పరిశీలించారు. తహసీల్దార్ మాట్లాడుతూ ఈకేవైసీ వలన ధాన్యం కొనుగోలు సమయంలో రైతులకు ఎటువంటి ఇబ్బంది వుండదన్నారు. రైతులు తప్పకుండా ఆధార్‌తో అనుసంధానం అయిన బ్యాంకు పాస్‌బుక్ కాపీతో పాటు ఆధార్ కార్డు, ఆధార్‌తో లింక్ అయిన మొబైల్ ఫోన్‌ను తీసుకొని రైతు భరోసా కేంద్రంలో వేలిముద్ర వేయాలన్నారు. మండల వ్యవసాయాధికారి మాట్లాడుతూ రైతులు ఎరువుల విషయంలో పక్క వారిని చూసి అధికంగా ఎరువులు వాడటం తగ్గించాలన్నారు. ప్రస్తుతం పొటాష్ కలిసిన ఎరువులు వాడాలన్నారు. దీని వల్ల ముంపునకు గురైన పొలంలోని వరి మొక్కలు పాడైపోకుండా ఉంటాయన్నారు. కలుపు మొక్కలు కూడా ఉధృతంగా ఉన్నాయని, సరైన మందు మాత్రమే వాడాలని చెప్పారు. వీలైతే కూలీలతో కలుపు తీయించుకోవడం ఉత్తమమన్నారు. గ్రామ వ్యవసాయ సహాయకుడు రవీంద్ర, వీఆర్వో బషీర్, రైతులు నరసింహారావు, బాలు తదితరులు పాల్గొన్నారు.

'శ్రావణలక్ష్మీ వైభవం' ప్రారంభం



పూజా కార్యక్రమాల కరపత్రాలను ఆవిష్కరిస్తున్న డెప్యూటీ మేయర్ భారతి, సమితి ప్రతినిధులు

మచిలీపట్నంటౌన్: ఈడేపల్లిలోని సత్య సాయిబాబా మందిరంలో నిజ శ్రావణ మాసం సందర్భంగా సత్యసాయి శ్రావణలక్ష్మీ వైభవ కార్యక్రమాన్ని డెప్యూటీ మేయర్ శీలం భారతి గురువారం జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం సాయిలలిత పరమేశ్వరికి కుంకుమ పూజలు నిర్వహించారు. 30 రోజుల పాటు భక్తుల ఇళ్ల వద్ద పూజా కార్యక్రమాలు జరుగుతాయని సాయిబాబా సమితి కన్వీనర్ పోతుకూచి ఆంజనేయకుమార్ తెలిపారు.

కార్యక్రమంలో సమితి జిల్లా అధ్యక్షుడు కొమరగిరి చంద్రశేఖర్, ఆధ్యాత్మిక కో–ఆర్డినేటర్ టి. కోమలాదేవి, సమన్వయకర్తలు వరప్రసాద్, కల్యాణి, కాళికాదేవి, నాగమణి, అనూరాధ, రత్నకుమారి, కొండలరావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా 30 రోజుల పాటు జరిగే పూజా కార్యక్రమాల కరపత్రాలను డెప్యూటీ మేయర్ భారతి ఆవిష్కరించారు.

ఆహ్లాదకరంగా లేగ దూడల అందాల పోటీలు



గెలుపొందిన లేగదూడల యజమానులతో పశుసంవర్థక శాఖాధికారులు

మొవ్వ: మండల కేంద్రం మొవ్వ గ్రామంలోని ఏరియా వెటర్నరీ ఆసుపత్రిలో డాక్టర్ డి.సుజన్ కుమార్ ఆధ్వర్యంలో గురువారం మండల స్థాయి లేగ దూడల అందాల పోటీలు జరిగాయి. మొవ్వ పరిసర ప్రాంతాల నుంచి 37 దూడలు పోటీలో పాల్గొనగా వి.వెంకటేశ్వరరావు(మొవ్వ), జొన్నలగడ్డ అరుణకుమారి (చినముత్తేవి), తాతా అంకారావు(కాజ)ల లేగదూడలు తొలి మూడు స్థానాలు సాధించాయి. గూడపాడు గ్రామానికి చెందిన సీహెచ్ రత్నగిరికి చెందిన లేగదూడకు కన్సొలేషన్ బహుమతి లభించింది. పోటీలను గ్రామ సర్పంచ్ తూము పూర్ణచంద్రరావు ప్రారంభించారు. జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు వేమూరి పరిశుద్ధరాజు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కృష్ణా జిల్లా పశుసంవర్థక శాఖ అధికారి డాక్టర్ ఎస్‌పీ దివాకర్, డీఎల్‌డీఏ ఈవో డాక్టర్ కె.శ్రీనివాసులు, మచిలీపట్నం డీడీ డాక్టర్ జేవీ రమణయ్య, ఆదర్శ రైతు పేకేటి సీతారామి రెడ్డి విజేతలకు ప్రోత్సాహక బహుమతులను అందజేశారు.

రౌడీ షీటర్లు సత్ప్రవర్తన కలిగి ఉండాలి

టూటౌన్ సీఐ తులసీధర్

గుడివాడరూరల్: రౌడీ షీటర్లు సత్ ప్రవర్తనతో నడుచుకోకపోతే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని టూటౌన్ సీఐ బి.తులసీధర్ హెచ్చరించారు. స్థానిక టూటౌన్ పోలీస్ స్టేషన్ వద్ద జిల్లా ఎస్పీ జాషువా, డీఎస్పీ పి.శ్రీకాంత్ ఆదేశాల మేరకు గురువారం టూటౌన్ పరిధిలోని రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ రౌడీషీటర్లు తమ ప్రవర్తనను మార్చుకుని నేరాలకు పాల్పడకుండా మంచి జీవనం కొనసాగించాలని కోరారు. రౌడీషీటర్ల ప్రవర్తనపై ఎప్పటికప్పుడు పోలీసు నిఘా ఉంటుందన్నారు. మంచి ప్రవర్తన కలిగిన వారిపై ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు రౌడీషీట్లు తొలగించే అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ నాగరాజు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.